సాక్షి నిర్మల్

గురువారం ♦ 2 ♦ మే ♦ 2024

I



ఘనంగా మే డే..

జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఊరూరా కార్మిక జెండాలను ఆవిష్కరించారు. IIIలో▸



పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కుభీర్‌లోని బజార్‌గల్లీలో ఇటీవల నిర్మించిన ఆలయంలో పోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. IIIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.0 /25.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. పగలు ఎండ తీవ్రత ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్క పోత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కొనుగోళ్లలో వేగం పెంచాలి

సోన్: వరి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. నిర్వాహకులతో మాట్లాడి కొనుగోళ్ల తీరు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లేశ్, అధికారులు, సిబ్బంది, రైతులున్నారు.

ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య జయంతి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకురాలు బీ సుజాత మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. 'పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన గొప్ప నేత' అని ఆయన సేవలు కొనియాడారు. ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, కోశాధికారి రామలక్ష్మి, భారతి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శైలజ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'కడెం' వాసికి డాక్టరేట్



రాజేశం

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన బండారి రాజేశం ఓయూలో ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన లింగు–రాజం దంపతుల కొడుకు రాజేశం ఆర్గానిక్ కెమిస్ట్రీలో 'డెవలప్‌మెంట్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్ కాటలైసెడ్ ఆఫ్ నైట్రోజన్‌ఫ్యూస్డ్ బెటిరో సైక్లిస్' అనే అంశంపై డాక్టర్ కే శివకుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ అందుకున్న రాజేశంను గ్రామస్తులు అభినందించారు.

రైతులకు ఇబ్బంది రానీయొద్దు



న్యూబొప్పారం కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో

సోన్: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని డీఆర్డీవో విజయలక్ష్మి సిబ్బందికి సూచించారు. బుధవారం న్యూబొప్పారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం వద్ద తాగునీరు, టెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. గన్నీసంచులను అందుబాటులో ఉంచుతూ.. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. అనంతరం న్యూ బొ ప్పారం ప్రాథమిక పాఠశాల, కడ్తాల్ ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో సురేశ్, ఏపీఓ మంజుల, ఏపీఎం గంగామణి, కార్యదర్శి లక్ష్మణ్, సంధ్య తదితరులున్నారు.

'నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం'




కాంగ్రెస్‌లో చేరినవారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పేర్కొన్నారు. సారంగాపూర్ ఎంపీటీసీ సభ్యుడు వెంకటరాంరెడ్డి ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అక్తర్, కొంతం అడేళ్ల బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసి శ్రీహరిరావు సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. వీరికి శ్రీహరిరావు పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడంలో కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు బొల్లోజీ నర్సయ్య, నాయకులు విలాస్‌రావ్, సత్యపాల్ రెడ్డి తదితరులున్నారు.

కష్టమే..!

- ఈసారి అత్యధిక ఉష్ణోగ్రతలు
- 44–46 డిగ్రీల వరకూ నమోదు
- ఎండలకు తోడు వడగాలులు
- జాగ్రత్తలు తప్పవన్న వైద్యులు



నిర్మల్: అసలైన ఎండాకాలం మొదలైంది. ఇప్పటికే ఎండలు దడదడలాడిస్తుండగా.. ఇకపై మరింతగా మండిపోనున్నాయి. ప్రస్తుతం 43–44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈనెల మొదటివారంలోనే 45–46డిగ్రీలు నమోదు కానున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. తీవ్రమైన ఎండలకు వడగాలులూ తోడవుతున్నాయి. ఇలా అత్యధిక ఉష్ణోగ్రతలతో ఈనెలంతా కష్'మే'నని జిల్లావాసులు బెంబేలెత్తుతున్నారు. ఈ ఎండలకు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. వడదెబ్బకు గురికాక తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న ఎండ..

జిల్లాలో రెండుమూడేళ్లుగా వర్షాలు, ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. అత్యధిక వర్షపాతంతో పాటు ఎండాకాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలూ నమోదవుతున్నాయి. ఇటీవల ఒకదస్తురాబాద్ మండలంలోనే వరుసగా 45డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతూ వస్తున్నాయి. తాజాగా మంగళవారం జిల్లావ్యాప్తంగా 45.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణశాఖ నివేదికలు వెల్లడించాయి. గతంలో 44 డిగ్రీల వరకే అత్యధికంగా నమోదయ్యేవి. ఏడాదికేడాది ఎండ మరింత ప్రచండమవుతోంది.

భయపెడుతున్న ఉష్ణోగ్రత..

ఈనెల ప్రారంభంతోనే జిల్లాలో 45.5డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. ఎండాకాలంలో మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు ఉండటం సాధారణమే. కానీ.. ఈసారి మొదటివారంలోనే 45–46 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదు అవుతుండటం జిల్లావాసులను భయపెడుతోంది. ఈనెల రెండోవారంలో కొంత వాతావరణం చల్లబడే అవకాశం ఉన్నప్పటికీ దాదాపు 44డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు ఉండనున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలకు వడగాలులు తోడవుతుండటంతో వడదెబ్బ బారిన పడే అవకాశాలు పెరుగుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు, రాత్రి ఉష్ణోగ్రతలకూ ఏమాత్రం పొంతన లేకుండా ఉండటమూ ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతున్నాయి.

జంకుతున్న జనం

మండుతున్న ఎండలకు బయట అడుగు పెట్టాలంటేనే జిల్లావాసులు జంకుతున్నారు. ఉదయం 8–9గంటల నుంచే ఎండ సుర్రుమంటోంది. ఉదయం 10 దాటిందంటే ఇక సాయంత్రం ఆరింటిదాకా మండుతూనే ఉంది. ఎండలో ఏమాత్రం తిరిగినా.. డీహైడ్రేషన్ అవుతోంది. సకాలంలో సరిపడా నీళ్లు తాగకపోతే వడదెబ్బ బారిన పడాల్సి వస్తోంది. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు పెట్టుకున్నా వేడిని తాళలేకపోతున్నారు. ఫ్యాన్‌గాలి కూడా వేడిగా వస్తుండటంతో అవసోపాలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు మరింత అవస్థలు పడాల్సి వస్తోంది.

జాగ్రత్తగా ఉండాల్సిందే..



వేసవిలో ఈనెల చాలా తీవ్రంగా ఎండలు ఉంటాయి. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలతో చాలామంది వడదెబ్బకు గురవుతున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు అత్యవసరమైతే మినహా ఎండలో వెళ్లొద్దు. తరచూ నీళ్లు, ద్రవాహారం తీసుకుంటుండాలి. ఏమాత్రం వడదెబ్బ లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ బాశెట్టి రవి, ఎండీ ఫిజీషియన్

'కార్పొరేట్'కు దీటుగా 'సర్కార్'



వందశాతం ఫలితాలు సాధించిన నిర్మల్ కేజీబీవీ విద్యార్థినులు

- పదో తరగతిలో 98.79శాతం ఉత్తీర్ణత
- 126 స్కూళ్లలో 100శాతం ఫలితాలు
- 95 మంది విద్యార్థులకు 10 జీపీఏ
- 'కార్పొరేట్'కు దీటుగా 'సర్కార్' సత్తా

నిర్మల్ రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గతేడాది రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన జిల్లా ఈ సారి మళ్లీ ఆ స్థానాన్ని పదిలపరుచుకున్న విషయం తెలిసిందే. కాగా, ఈసారి జిల్లాలోని సర్కార్ బడులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సత్తా చాటాయి. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 98.79 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పాఠశాలల వారీగా ఫలితాలు..

జిల్లాలో 165 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో ఎనిమిది స్టేట్ గవర్నమెంట్ పాఠశాలల్లో 96.23 శాతం ఫలితాలు నమోదయ్యాయి. 107 జెడ్పీ హైస్కూళ్లలో 98.24శాతం, 18 కేజీబీవీల్లో 99.86 శాతం, ఐదు మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలల్లో 100 శాతం, కుంటాల మోడల్ స్కూల్‌లో 100శాతం, 13 ఆశ్రమ పాఠశాలల్లో 100శాతం, ఆ రు టీఎస్‌టీడబ్ల్యూఆర్ఈఐ సొసైటీ పాఠశాలల్లో 100శాతం, ఆరు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల్లో 99.77శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

95 మందికి 10 జీపీఏ..

కార్పొరేట్ పాఠశాలల్లో చదివితేనే 10 జీపీఏ వస్తుందనే భ్రమలు తొలగించి సర్కార్ బడుల్లో చదివిన విద్యార్థులు చాలామంది 10 జీపీఏ సాధించారు. జిల్లాలోని 165 ప్రభుత్వ పాఠశాలల్లో 95 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. ఇందులో 79 మంది బాలికలు, 16 మంది బాలురున్నారు. తొమ్మిది మంది జెడ్పీ హైస్కూళ్లలో, 12 మంది కేజీబీవీల్లో, ముగ్గురు మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలల్లో, 29మంది మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల్లో, ముగ్గురు కుంటాల మోడల్ స్కూల్‌లో, 27 మంది టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఈఐ పాఠశాలల్లో, ఒకరు ఆశ్రమ పాఠశాలలో 10 జీపీఏ సాధించారు. జిల్లాలో 165 ప్రభుత్వ పాఠశాలలుండగా 126 స్కూళ్లు 100శాతం ఫలితాలు సాధించాయి. ఇందులో 77 జెడ్పీ హైస్కూళ్లు, రెండు స్టేట్ గవర్నమెంట్ పాఠశాలలు, 17 కేజీబీవీలు, ఐదు మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలలు, ఐదు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలు, ఒక టీఎస్ మోడల్ స్కూల్, ఏడు టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ పాఠశాలలు, 12 ఆశ్రమ పాఠశాలలున్నాయి.

మంత్రి సీతక్క అభినందనలు



సీతక్క

పదో తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలవడంతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఓ ప్రకటనలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు నిరాశ చెందకుండా తిరిగి మళ్లీ రాసి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఉత్త మ ఫలితాల సాధనకు ప్రణాళికతో కృషి చేసి న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

15వరకు రీకౌంటింగ్‌కు గడువు

విద్యార్థుల రీకౌంటింగ్ కోసం రూ.500 ఫీజు చెల్లించాలని, రీవెరిఫికేషన్, డూప్లికేట్ జవాబు పత్రాల కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున ఈ నెల 15లోపు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. హాల్‌టికెట్‌తో పాటు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకంతో కూడిన దరఖాస్తు ఫారాన్ని డీఈవో కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో నేరుగా అందజేయాలని సూచించారు. ఫెయిలైన విద్యార్థులకు జూన్ 3నుంచి 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

సత్తా చాటిన కేజీబీవీలు

పదో తరగతి ఫలితాల్లో కస్తూర్బా విద్యార్థినులు, సోఫీనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల విద్యాలయం విద్యార్థినులు ప్రత్యేక గుర్తింపు పొందారు. జిల్లాలో 18 కేజీబీవీలుండగా వీటిలో ఒకరు మాత్రమే ఫెయిలయ్యారు. 12మంది 10 జీపీఏ సాధించారు. 296 మంది 9–10 జీపీఏ లోపు సాధించడం విశేషం. 17 పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత పొందాయి. సోఫీనగర్ గురుకులం 100 శాతంతో మరోసారి తన స్థానం పదిలపరుచుకుంది. కొన్నేళ్లుగా ఈ పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. 11 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించడం గమనార్హం. జిల్లా కేంద్రంలో నిర్వహించే లక్ష్మణచాంద మండలం రాచపూర్‌లోని జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు 71 మందికి ఒకరు గైర్హాజరు కాగా, 70 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ముగ్గురు 10 జీపీఏ పొందారు.

సమష్టి కృషితోనే..



పదో తరగతి ఫలితాల్లో రెండోసారి రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ రావడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు కష్టపడి ఈ విజయం సాధించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాం. ఇందులో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచాం. ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యాసంవత్సరం కూడా ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకువెళ్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

పన్ను రాయితీకి స్పందన

- 34.23శాతంతో లక్సెట్టిపేట ముందంజ
- ఐదుశాతంతో భైంసా చివరి స్థానంలో..

భైంసాటౌన్: పట్టణాల్లో ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుపై ఇస్తున్న రాయితీకి ప్రజల నుంచి స్పందన లభించింది. ఏటా నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి పురపాలకశాఖ ఎర్లీబర్డ్ స్కీం కింద పన్ను డిమాండ్‌పై ఐదుశాతం రాయితీ ఇస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి కూడా ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపుపై రాయితీకి ఏప్రిల్ 30వరకు గడువు విధించింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

బకాయిల వసూలుకు చర్యలు..

బల్దియా సిబ్బంది వేతనాలు, కరెంట్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ వాహనాలకు ఇంధనం అవసరాలు తీరాలంటే పన్నులు సకాలంలో వసూలు చేయాలి. అయితే చాలా మున్సిపాలిటీల్లో ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలోనే హడావుడిగా పన్నుల వసూలు చేస్తున్నారు. పన్నుల చెల్లింపుపై ప్రజలకు చాలావరకు అవగాహ న లేక సకాలంలో చెల్లించడం లేదు. దీంతో ఏటా ఆస్తి పన్ను బకాయిలు, వాటిపై వడ్డీ బకాయిలు పే రుకు పోతున్నాయి. దీంతో బకాయిల వసూలుకు పురపాలక శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరం వర కు పన్ను బకాయిలున్నవారికి గత మార్చి 31లోపు చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశం కల్పించింది. దీంతో చాలామంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. తాజాగా ముందస్తు చెల్లింపుపై కూడా ఐదుశాతం రాయితీ కల్పించడంతో అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

మొదటి స్థానంలో లక్సెట్టిపేట..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బల్దియాల్లో ఎర్లీబర్డ్ స్కీంను పన్ను చెల్లింపుదారులు వినియోగించుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు ఎలాంటి బకాయిలు లేనివారు.. 2024–25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించి ఐదుశాతం రాయితీ పొందారు. ఎర్లీబర్డ్ స్కీం సద్వినియోగంలో ఉమ్మడి జిల్లాలోనే లక్సెట్టిపేట మున్సిపాలిటీ 34.23 శాతం వసూలుతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తరువాతి స్థానంలో క్యాతన్‌పల్లి 30.99 శాతంతో రెండోస్థానంలో, ఐదుశాతం వసూలుతో భైంసా మున్సిపాలిటీ చివరిస్థానంలో నిలిచింది.

బీఆర్ఎస్‌కు 'అల్లోల' రాజీనామా

- గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరిక



ఐకేరెడ్డికి కండువా వేస్తున్న దీపాదాస్ మున్షి

నిర్మల్: జిల్లా రాజకీయాల్లో రెండునెలలుగా సాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. సీనియర్ రాజకీయనేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన బుధవారం సాయంత్రం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామా లేఖ పంపించారు. అనంతరం గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు.

సుదీర్ఘ అనుభవం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన నేతగా పేరున్న ఐకేరెడ్డి 1980 దశకంలో టీడీపీ నుంచి రాజకీయాల్లోకి అడుగుపె ట్టిన అల్లోల 1987–1991 వరకు జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించారు. 1991–96 వరకు ఆదిలాబాద్ ఎంపీగా కొనసాగారు. అప్పుడు కేంద్రంలో మైనార్టీలో పడిన పీవీ నర్సింహారావు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 1999–2004 వరకు నిర్మల్ ఎమ్మెల్యేగా కొనసాగారు. అప్పట్లో తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫోరం కన్వీనర్‌గా, తెలంగాణ రీజినల్ కాంగ్రెస్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. 2004లోనూ మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచారు. 2008–2009 వరకు ఆదిలాబాద్ ఎంపీగా ఉన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరారు. 2014 ఎన్నికల సమయంలో బీఎస్పీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి, గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి అయ్యారు. 2018లో బీఆర్ఎస్ నుంచి గెలిచి మంత్రిగా కొనసాగారు. ఇటీవల 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటూ వచ్చారు. పార్టీ అధినేత కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి గైర్హాజరు కావడంతో ఇక ఆయన పార్టీ వీడుతారన్న విషయం స్పష్టమైంది.

రెండు నెలల ఉత్కంఠకు తెర

దాదాపు రెండునెలల ఉత్కంఠ తర్వాత ఇంద్రకరణ్‌రెడ్డి ఎట్టకేలకు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన పార్టీలో చేరడాన్ని ముందునుంచీ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు గట్టిగా వ్యతిరేకించారు. దీంతో అల్లోల ఎన్ని ప్రయత్నాలు చేసినా చేర్చుకోవడంపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వలేదు. ఆయన అనుచరులు తనకంటే ముందే డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక అల్లోల చేరిక ఉంటుందా.. లేదా.. అన్న సందేహాలు రేకెత్తుతున్న వేళ.. ఎట్టకేలకు కాంగ్రెస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో అల్లోల బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు కేసీఆర్‌కు లేఖ పంపించారు. అనంతరం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

విధులపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- ఎన్నికల విధులపై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఒకరోజు ముందే సామగ్రితో కేటాయించిన పోలింగ్‌స్టేషన్లకు చేరుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ఇస్తున్న రెండో విడత ఎన్నికల అవగాహన శిక్షణ సదస్సుకు హాజరై మాట్లాడారు. పోలింగ్‌రోజు ఉదయం 5.30కి అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్లకు మాక్ పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, ఆ తర్వాత సీఆర్సీ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. మాక్ పోలింగ్‌లో నమోదైన వీవీ ప్యాట్ స్లిప్పులను సంబంధిత కవర్లలో భద్రపరచాలని, ప్రతీ రెండు గంటలకు ఓటింగ్ శాతానికి సంబంధించిన వివరాలు వారివారి సెక్టార్ ఆఫీసర్లకు అందజేయాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన 17 సీ ఫారం, పీవో డైరీ, తదితర రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈవీఎంల పనితీరును పరిశీలించి వాటిలో ఏవైనా సమస్యలుంటే పైఅధికారుల ఆదేశానుసారమే ఈవీఎం సెట్లను మార్చాలని పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత జాగ్రత్తగా రిసెప్షన్ కేంద్రాల్లో ఈవీఎంలను అందించాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా మాస్టర్ ట్రైనర్లను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని తెలిపారు. అనంతరం పలువురు మాస్టర్ ట్రైనర్లు అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఆర్డీవో రత్నకళ్యాణి, మాస్టర్ ట్రైనర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పాటుపడాలి



ముథోల్: మొక్క నాటుతున్న ఎస్పీ జానకి షర్మిల

ముథోల్: నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. బుధవారం భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌తో కలిసి ముథోల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు సీఐ మల్లేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించి మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఎస్సై సాయికిరణ్, సిబ్బంది ఉన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

నర్సాపూర్ (జి): ఫిర్యాదులపై సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రిసెప్షన్, టెక్నికల్ రూంలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్సై హన్మాండ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో చేపట్టిన ఎన్నికల ప్రక్రియ వివరాలు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, నిర్మల్, భైంసా, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్, డీపీఆర్వో విష్ణువర్ధన్, డీపీవో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, ఉపాధి కల్పనాధికారి రాములు, ఈడీఎం నదీం, ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలోని బల్దియాలు.. పన్ను వసూలు (రూ.కోట్లలో)

బల్దియా	అసెస్‌మెంట్లు	డిమాండ్	చెల్లించింది	వసూలు	శాతం
ఆదిలాబాద్	46,942	రూ.15.57	6,206	రూ.2.14	13.74
లక్సెట్టిపేట	5,873	రూ.1.49	1,306	రూ.0.51	34.23
క్యాతన్‌పల్లి	12,017	రూ.3.55	4,528	రూ.1.10	30.99
మంచిర్యాల	27,128	రూ.16.42	4,438	రూ.3.28	19.98
బెల్లంపల్లి	16,042	రూ.4.42	1,596	రూ.0.58	13.12
చెన్నూర్	7,164	రూ.2.51	780	రూ.0.28	11.16
నస్పూర్	17,314	రూ.6.27	1,905	రూ.0.61	9.73
మందమర్రి	14,559	రూ.3.23	960	రూ.0.22	6.81
కాగజ్‌నగర్	14,660	రూ.3.52	1,277	రూ.0.34	9.66
నిర్మల్	24,145	రూ.10.87	2,156	రూ.1.30	11.96
భైంసా	12,385	రూ.6.51	1,049	రూ.0.35	5.00
ఖానాపూర్	6,995	రూ.1.58	523	రూ.0.08	5.06

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి ఒకరి మృతి


శంకర్ (ఫైల్)

ఖానాపూర్: తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాదనకుర్తి గ్రామానికి చెందిన మంచికంటి శంకర్ (45) కూలీ పని చేస్తుంటాడు. తాటిచెట్లు ఎక్కి ముంజలు తెంపి విక్రయించి ఉపాధి పొందుతాడు. బుధవారం శంకర్ బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్‌లో మోకు లేకుండానే తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. శంకర్‌కు భార్య శైలజ ఉంది. అందరూ టైగర్ అని పిలుచుకునే శంకర్ మృతి గ్రామంలో విషాదం అలుముకుంది.

కాలిన డ్రిప్ పైపులు


కాలిన డ్రిప్ పైపులు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన మర్రిపెద్దోల్ల భూమన్న డ్రిప్ పైపులు మంగళవారం రాత్రి నిప్పంటుకుని కాలిబూడిదయ్యాయి. కాగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతోనే మూడెకరాలకు చెందిన డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు ఆరోపించాడు. తనకు రూ. 1.20లక్షల నష్టం జరిగినట్లు వాపోయాడు.

గుడుంబా పట్టివేత


పట్టుబడ్డ గుడుంబాతో పోలీసులు

సారంగాపూర్:మండలంలోని లక్ష్మీనగర్‌తండాలో గుడుంబా స్థావరంపై బుధవారం దాడి చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన జాదవ్ మోదీబాయి ఇంట్లో 15లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 120 లీటర్ల బెల్లం పానకం పారబోశామని తెలిపారు. సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ లావాదేవీల కేసులో ఒకరి అరెస్ట్!

భైంసాటౌన్: అక్రమ లావాదేవీల విషయంలో భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఒకరిని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బుధవారం వేకువజామున భైంసాకు చేరుకున్న అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సదరు యువకుడిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో క్రికెట్ బెట్టింగ్ విషయంలో కొందరి బ్యాంక్ ఖాతాల నుంచి అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించిన సైబర్ సెక్యూరిటీ పోలీసులు ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. కాగా, కేసు విచారణకు హాజరు కాకపోవడంతో ఈ మేరకు భైంసాకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది. ఈ విషయమై పట్టణ సీఐ డీ రాజారెడ్డిని వివరణ కోరగా, తమకు సమాచారం లేదని పేర్కొన్నారు.

బావి నీరే.. తాగునీరు!


ఎడ్లబండి ద్వారా నీటిని తీసుకువస్తున్న గ్రామస్తుడు

- నాగాపూర్‌లో నీటి గోస
- పనిచేయని చేతిపంపులు
- సరిపోని 'మిషన్ భగీరథ'
- గ్రామస్తులకు తప్పని తిప్పలు

బోథ్: తరాలు మారినా పల్లె ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చెబుతున్న పాలకులు.. గ్రామాలకు గుక్కెడు నీరందివ్వడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఇందుకు బోథ్ మండలంలోని నాగాపూర్ గ్రామమే సాక్ష్యం.

సరిపోని మిషన్ భగీరథ నీరు..

గ్రామంలో మిషన్ భగీరథ పథకం ఉన్నా కొద్దిపాటి ఇళ్లకు మాత్రమే నల్లా కనెక్షన్లు ఉన్నాయి. రెండు మూడు రోజులకోసారి వచ్చే నల్లా కేవలం 15 నిమిషాలు మించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే కుచ్చిర్యాల గ్రామం వద్ద తరచూ పైపులైన్ లీకేజీ అవుతుండడంతో ఆ నీటిని తాగలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. ఈక్రమంలో తమకు బావి నీరే దిక్కవుతుందని అంటున్నారు. అయితే బావిలోకి నీళ్లు నింపే క్రమంలో ఆ నీరు కూడా కలుషితమవుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటింటికీ తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


జైనూర్ నుంచి పైపులైన్ ద్వారా బావిలో నీటిని నింపుతున్నారిలా..

గ్రామంలో నీటి కష్టాలు ఇలా..

గ్రామంలో ఆదివాసీ, లంబాడా కుటుంబాలు ఉన్నాయి. సుమారు 700 వరకు జనాభా ఉంటుంది. ఈ ఊరికి మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా కొద్ది ఇళ్లకు మాత్రమే కనెక్షన్లు ఉన్నాయి. వారానికి మూడు రోజులు మించి నీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అదికూడా కొద్దిసేపు మాత్రమే వస్తుందని, అలాగే లీకేజీల కారణంగా వచ్చే ఆ నీరు తాగేందుకు ఉపయోగపడడం లేదని చెబుతున్నారు. దానిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు పేర్కొంటున్నారు. మరోవైపు ఉన్న మూడు చేతిపంపులు నెలల తరబడి మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఈ క్రమంలో ఊరివాసులకు బావి నీరే దిక్కవుతోంది. పొరుగూరైన జైనూర్ పల్లె సమీపంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి పైపులైన్ ద్వారా వచ్చే నీటిని ఈ బావిలోకి నింపి వినియోగించుకుంటున్నారు. ఎడ్లబండ్లపై డ్రమ్ములు కట్టుకొని బావి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఓట్ల కోసం నాయకులు వస్తున్నారే తప్ప తమ నీటి గోస తీర్చే వారే కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎడ్లబండిపై తెచ్చుకుంటున్నం..



గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ నీళ్లు సరిగా వస్తలేవు. దీంతో ఊరి బయట ఉన్న బావి నీళ్లనే తాగుతున్నం. జైనూర్‌కు వెళ్లే దారిలో ఉన్న బోరు నుంచి నీళ్లను పైపులైన్ ద్వారా బావిలో నింపుతున్నం. ఎడ్లబండిపై డ్రమ్ములతో ఆ నీళ్లు తెచ్చుకొని తాగుతున్నం.

– తలెండ గంగారాం, నాగాపూర్

ఇంట్లో ఒకలకు నీళ్ల పనే..



నీళ్లకు చానా తిప్పలైతంది. మూడు, నాలుగు రోజులకోసారి వచ్చే మిషన్ భగీరథ నీళ్లు సరిపోతలేవు. ఇంట్లో ఒకలకు నీళ్ల పనే ఉంటంది. ఎడ్లబండిపై డ్రమ్ములు పెట్టుకొని బావి వద్దకు పోయి తెచ్చుకుంటున్నం.

– గొడం గంగుబాయి, నాగాపూర్

నాణ్యమైన విద్యుత్ అందించాలి

జైనథ్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిచడమే లక్ష్యంగా సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్‌ఈ జేఆర్ చౌహాన్‌తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈ నగేశ్, లైన్ ఇన్‌స్పెక్టర్ అరవింద్, లైన్‌మెన్ ఆనంద్, జేఎల్‌ఎం శరత్, ఆపరేటర్ నరేశ్ తదితరులున్నారు.

నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలి

బేల: నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యమని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ మోహన్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి సబ్‌స్టేషన్ నిర్వహణపై ఆరా తీశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఈ జయంత్ చౌహాన్, డీఈలు హరికృష్ణ, ప్రభాకర్, ఏఈ సంతోష్, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న మోహన్‌రావు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- పెళ్లయిన పది రోజులకే తిరిగిరాని లోకాలకు..

నేరడిగొండ: మండలంలోని బుర్కపల్లి జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం లింగట్ల గ్రామానికి చెందిన రాథోడ్ మహేందర్ (25) జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నాడు. ఉదయం ఆదిలాబాద్‌కు వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో బుర్కపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బలమైన గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రోల్‌మామడ గ్రామానికి చెందిన కనక గణేశ్ పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మృతుడికి గత నెల 21న నిర్మల్ జిల్లాలోని మామడ మండలం రాయదారి గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. పది రోజులు కాక ముందే ఇలా మృత్యువాత పడడంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.


మహేందర్ మృతదేహం
మహేందర్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాహుల్ (ఫైల్)

కడెం: కామారెడ్డి వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట్ గ్రామానికి చెందిన వెంకటి–నర్సాగౌడ్ దంపతుల రెండో కుమారుడు రాహుల్ (22) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో జాబ్ చేస్తున్నాడు. బుధవారం స్వగ్రామానికి వచ్చేందుకు పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. కామారెడ్డి సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాహుల్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

సీపీఐ నాయకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బెదిరింపులకు పాల్పడిన సీపీఐ నాయకులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్ బుద్ధవిహార్‌లో బుధవారం ఉదయం సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు కట్ట చంద్రమౌళి, అరుణ్ కుమార్, మహ్మద్ అక్బర్ అలీ, మనోజ్ కుమార్ బెదిరింపులకు పాల్పడినట్లు కాలనీకి చెందిన మహిళ దొనె శోభన ఫిర్యాదు చేశారు. బుద్ధవిహార్‌లో చొరబడి సీపీఐ జెండాలు పాతి అసభ్యపదజాలంతో దూషించారని తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం వడదెబ్బతో ఐబీ తాండూరుకు చెందిన తోట రాజవ్వ(80) మృతిచెందింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మంచిర్యాల బస్టాండ్‌లో బస్సు దిగిన తర్వాత అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతిచెందిందని ధ్రువీకరించారు.

ఆవు దాడిలో బాలుడికి గాయాలు


గణేశ్ తలపై గాయం

దహెగాం: మండల కేంద్రానికి చెందిన గొర్రె గణేశ్ అనే బాలుడిపై ఆవు దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. గణేశ్ బుధవారం మధ్యాహ్నం ఇంటి ఎదుట ఆడుకుంటున్న సమయంలో ఆవు ఒక్కసారిగా కొమ్ములతో తలపై పొడిచింది. తలకు తీవ్రగాయం కావడంతో వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గణేశ్‌ను మంచిర్యాలకు తరలించామని కుటుంబ సభ్యులు తెలిపారు.

అస్వస్థతతో ఆదివాసీ రైతు మృతి


మృతి చెందిన ఆత్రం జంగు

బోథ్: మండలంలోని పరుపుల పల్లె గ్రామానికి చెందిన రైతు ఆత్రం జంగు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగు మంగళవారం కొంత అస్వస్థతకు గురయ్యాడు. సొనాల ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. బుధవారం ఉదయం తాను కౌలుకు తీసుకున్న చేనుకు వెళ్లాడు. ఎండ తీవ్రత నేపథ్యంలో అస్వస్థతకు గురై వెంటనే ఇంటికి చేరుకున్నాడు. ఆ వెంటనే కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు యత్నించగా అప్పటికే చనిపోయాడు. కాగా, మృతుడికి ఇద్దరు భార్యలు, ఐదుగురు ఆడ పిల్లలు సంతానం.

వ్యక్తి మృతి


మృతుడు పాండు

బోథ్: మండల కేంద్రంలో మెకానిక్ పాండు అస్వస్థతతో మృతిచెందాడు. మండల కేంద్రంలోని ఓ భవనంపై ఆయన మృతదేహం బుధవారం కనిపించింది. వివరాలిలా ఉన్నాయి. పాండు గత 35ఏళ్ల క్రితం హైదరాబాద్ పుత్లిబోలి నుంచి బోథ్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. అప్పటినుండి ఆయన ఒంటరి జీవనం కొనసాగిస్తున్నాడు. పలు మెకానిక్ షాప్‌ల్లో పనిచేస్తుండేవాడు. గత నాలుగు రోజుల నుంచి కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. బుధవారం ఓ భవనం వాసన రావడంతో స్థానికులు చూడగా మృతదేహం కనిపించింది. ఆయన చేతిపై లక్ష్మి అని పచ్చబొట్టు ఉంది. గ్రామ పెద్దలు బుధవారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

పౌర హక్కుల రక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న కవి జయరాజు

ఆదిలాబాద్‌టౌన్: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై దాడులు తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రకృతి కవి, ప్రజావాగ్గేయకారుడు జయరాజు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని యాదవ సంఘ భవనంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేడు ప్రశ్నించే గొంతుకలు, ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ రచయితలు, ప్రగతిశీల జర్నలిస్టులపై ప్రభుత్వాలు నిర్బంధకాండకు పూనుకోవడం సరి కాదని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ప్రగతిశీల మేధావులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రశ్నించే గొంతుకలకు ప్రజలంతా అండగా నిలబడాలని కోరారు. ప్రజల హక్కులు కాపాడటం కోసం కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు కృషి చేయాలని కోరారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వరగంటి అశోక్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఐక్యవేదిక నాయకులు ఎ.కిరణ్, పి.సచిన్, ఎం.సురేశ్, డి.మల్లేశ్, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ప్రమిళ జైన్

ఆదిలాబాద్‌టౌన్: న్యాయవాదులు బాధ్యతగా చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రమిళ జైన్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిలు మంజుల సూర్యవార్, తులసీ దుర్గారాణి, మహ్మద్ అసదుల్లా, జి తిరుకుమార్, న్యాయవాదులు తిలోత్తమ, ఉమేష్‌రావు, సంజయ్ రెడ్డి, వెంకట్ కుమార్, జైపాల్ రెడ్డి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ ఖరారు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ ధ్రువీకరణ కోసం ఈ నెలలో నిర్వహించనున్న సదరం క్యాంపుల తేదీలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఓ ప్రకటనలో ప్రకటించారు. 22న ఆర్థో, అంగవైకల్యం పీవీపీ, 4న వినికిడి, 10న మానసిక వికలాంగులు, 29న కంటి సంబంధిత శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హులు తమ పరిధిలోని పీహెచ్‌సీ వైద్యుడితో అవుట్ పేషెంట్ స్లిప్ ద్వారా దివ్యాంగ కేటగిరిని నిర్ధారించుకుని దాని ప్రకారం మీ సేవలో ఈనెల 3వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్నవారే సదరం క్యాంపులకు ఉదయం 9గంటలకు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హాజరు కావాలని సూచించారు.

స్లాట్ బుకింగ్ పెంచాలి

మే నెలకు సంబంధించి శారీరక దివ్యాంగుల స్లాట్ బుకింగ్ పెంచి ఇంతకుముందు ఇచ్చిన వారికి అవకాశం కల్పించాలని దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్తి సాయన్న ఓ ప్రకటనలో కోరారు. సదరం స్లాట్ బుకింగ్‌లో శారీరక దివ్యాంగులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ప్రతీ క్యాంపులో ఒక్కో కేటగిరికి 50 మందినే స్లాట్‌లో కేటాయించడం ద్వారా చాలామంది ఇబ్బందులుఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వేకువజాము నుంచే మీ సేవ కేంద్రాల ఎదుట బారులు తీరినా ఆన్‌లైన్‌లో కేటాయించిన స్లాట్‌లు గంట లోపే అయిపోతున్నాయని తెలిపారు. ప్రతీ నెల స్లాట్ బుకింగ్ పెంచి అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. శిబిరాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఎన్నికల తర్వాత కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్ష చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీకాంతపూర్‌కు చెందిన జిల్లపెల్లి మల్లవ్వ, జెల్లి శ్రీధర్, లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన రేణి సుమలత, రవి కారులో హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్తున్నారు. వీరి కారు కన్నెపల్లి వద్దకు చేరుకోగా ముందు వెళ్తున్న ఓ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఐషర్ వ్యాను కూడా వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారందరినీ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై భూమేష్‌ను సంప్రదించగా, రోడ్డు ప్రమాదం జరిగిందని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాండూర్ ఎస్సై సస్పెన్షన్?

తాండూర్: రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో ఆరోపణలు వచ్చిన తాండూర్ ఎస్సై కె.జగదీష్‌గౌడ్ సస్పెండ్ అయినట్లు తెలుస్తోంది. బుధవారం మల్టీ జోన్–1 ఐజీ ఎ.రంగనాథ్ రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ, నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పీడీఎస్ బియ్యం అక్రమ దందాపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా తాండూర్ రేషన్ బియ్యం అక్రమ రవాణా ఘటన పై చర్చించినట్లు తెలుస్తోంది. గత నెల 20న తాండూర్ పోలీసులు ఓ వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న వ్యవహారంలో భాగస్వాములైనవారు ఏకంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి నెలవారీగా ముడుపులు ఇస్తున్నా బియ్యం పట్టు కోవడం ఏంటని ఎస్సైని నిలదీసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఎస్సై పాత్రపై ఆరోపణలు రావడం, కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు నిర్ధారణకు వచ్చి ఐజీ రంగనాథ్ ఎస్సై జగదీష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు సమాచారం లేదన్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(50) మృతిచెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల–మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కింద పడి ఉన్న మృతదేహం లభించింది. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. తల వెంట్రుకలు తెలుపు రంగు, ఒంటిపై క్రీమ్ కలర్ చొక్కా, వంకాయ రంగు ప్యాంట్ ఉన్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చారు.



ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత భగ్గుమంటోంది. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. దీంతో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పచ్చదనం కనుమరుగవుతోంది. కూడళ్ల నిర్వహణను పర్యవేక్షించాల్సిన బల్దియా అధికారులు వాటికి నీరందించకపోవడంతో ఎన్టీఆర్, కలెక్టర్‌చౌక్ కూడళ్లలోని మొక్కలు, లాన్ పూర్తిగా ఎండిపోయి మైదానంలా కనిపిస్తోంది. బల్దియా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.





– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్-కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత



ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న ఆలియాస్ జిసు(66), కాసరబోయిన వినయ్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చి రోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పొడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

- ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

- మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
- మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
- విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిర్థ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చేల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

➡ 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పుర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.


విప్లవోద్యమంలో రాలిన ఎర్ర మందారం

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో కాసవేణ రవి మృతి
- బెల్లంపల్లిలో విప్లవోద్యమ ఓనమాలు
- మూడు దశాబ్దాలకు పైగా అజ్ఞాతం
- ఆదివాసీ పోరాటాలకు నాయకత్వం

బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా టేక్‌మెట-కాకూర్ గ్రామాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఎర్రమందారం నేలరాలింది. మూడు దశాబ్దాల అజ్ఞాత వాసానికి మృతితో తెరపడింది. మృతిచెందిన పది మంది మావోయిస్టుల్లో బెల్లంపల్లికి చెందిన కాసవేణ రవి ఉరఫ్ అశోక్ ఉరఫ్ వినయ్(48) ఉండడం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. చిన్న వయస్సులోనే విప్లవోద్యమానికి ఆకర్శితుడై దండకారణ్య కమిటీ సభ్యుడిగా ఎదిగిన రవి మృతితో బెల్లంపల్లితోపాటు స్వగ్రామం వంగరలో విషాదం నెలకొంది.

సింగరేణి కార్మిక కుటుంబం

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కాసవేణ లక్ష్మి, రాజయ్య దంపతులు 1961లో బెల్లంపల్లికి వలస వచ్చారు. రాజయ్యకు సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగం రావడంతో బెల్లంపల్లి మున్సిపాల్టీ కన్నాలబస్తీలోని సింగరేణి క్వార్టర్స్‌లో నివాసం ఉన్నారు. వీరికి కుమారులు వెంకటేష్, తిరుపతి, రవి, కూతురు హాల్య ఉన్నారు. అందరికంటే చిన్నవాడైన రవి విప్లవోద్యమంలోకి వెళ్లిన తర్వాత రాజయ్య 2001లో కార్మికుడిగా రిటైర్డు అయ్యాడు. అనంతరం స్వస్థలం వంగరకు వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు.



ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రవి

బాల్యంలోనే విప్లవబాట

రవి స్థానిక టేకులబస్తీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల(హౌజ్‌ల బడి)లో 7వ తరగతి వరకు చదివాడు. 8వ తరగతి కోసం బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరాడు. 9వ తరగతి నుంచి విప్లవోద్యమాలకు ఆకర్షితుడయ్యాడు. అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస)లో మిలిటెంట్‌గా పని చేశాడు. సికాస శ్రేణులకు కొరియర్‌గా పని చేస్తూ పోలీసుల నిర్బంధంలో ఎంతో నేర్పుగా వాల్‌పోస్టర్లు వేయడంలో దిట్టగా పేరుగాంచాడు. గంగారాంనగర్ బస్తీ ఏర్పాటు, పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించాడు. ఈ క్రమంలో చదువుపై దృష్టి సారించకపోవడంతో పదో తరగతి తప్పాడు. దీంతో పెద్దన్న వెంకటేష్ రవిని మందలించాడు. అప్పటికే సికాస కార్యకలాపాల్లో రవి పేరు బెల్లంపల్లిలో మారుమోగడంతో పోలీసులు వెతకడం తీవ్రతరం చేశారు. 16ఏళ్ల ప్రాయంలో విప్లవోద్యమానికి జీవితం అంకితం చేసి 1993లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. చెన్నూర్ దళంలో కొంత కాలం పని చేసిన తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా దండకారణ్యంలోకి వెళ్లి ఉద్యమ వ్యాప్తికి తన వంతు పాత్ర పోషించాడు.

అంచెలంచెలుగా దండకారణ్య కమిటీ సభ్యుడిగా ఎదిగి..

సాధారణ కార్యకర్తగా సికాసలో చేరిన రవి మిలిటెంట్‌గా రూపాంతరం చెందాడు. బెల్లంపల్లి కోల్‌బెల్ట్ ప్రాంతంలో వివిధ హోదాల్లో పని చేసి మూడు దశాబ్దాలకు పైగా దండకారణ్యం కేంద్రంగా విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. పోలీసు ఎదురు కాల్పుల్లో ఎన్నోసార్లు చాకచక్యంగా తప్పించుకున్నాడు. దండకారణ్యంలో ఆదివాసీలతో దండు కూడగట్టాడు. మావోయిస్టు పార్టీలో దండకారణ్య కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగాడు. విప్లవ ప్రస్థానంలో సవాళ్లతో సహవాసం చేస్తూ అడవుల్లో అస్తమించి అమరుడయ్యాడు.

భౌతికదేహం కోసం వెళ్లిన కుటుంబీకులు

రవి భౌతిక దేహాన్ని తీసుకు రావడానికి సోదరుడు వెంకటేష్, సన్నిహితులు, బంధువులు ఛత్తీస్‌గఢ్‌కు బుధవారం వెళ్లారు. గురువారం రవి భౌతికకాయంతో స్వగ్రామం వంగరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంత్యక్రియలు వంగరలోనే నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

జిజ్ఞాస పోటీల్లో మొదటి బహుమతి



బహుమతి పొందిన విద్యార్థినులు



ప్రశంసపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో కరీంనగర్ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సంస్కృతి ఆడిటోరియంలో బుధవారం బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ఉర్దూ విభాగం నుంచి ఖలీం మొహియుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు తెలంగాణ మెయిన్ ఉర్దూగా ఫెస్టివల్ నిజామీతలీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. కళాశాల విద్య కమిషనర్ బుర్రా వెంకటేశం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, ప్రాజెక్టు సూపర్‌వైజర్, విద్యార్థినులకు బహుమతితోపాటు రూ.30 వేలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల విద్య కమిషనర్ కార్యాలయ ఏజీవో బాలభాస్కర్, జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, ఆర్‌జేడీ యాదగిరి, రూసా కో-ఆర్డినేటర్ సౌందర్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థులకు తృతీయ..

హిందీ సహ ఆచార్యుడు వి.వరప్రసాద్ పర్యవేక్షణలో మహమ్మద్ ముజు తబా, మహమ్మద్ ఆసిఫ్, షేక్ షర్జీల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ తదితర విద్యార్థులు సోషల్ మీడియాలో హిందీ భాష : ఒక అధ్యయనం(వాట్సాప్, ఫేస్ బుక్‌లకు ప్రత్యేకంగా) అనే ప్రాజెక్టు రూపొందించారు. ఇది తృతీయ బహుమతి గెలుచుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు వారిని అభినందించారు.

అగ్రహారం విద్యార్థులకు ద్వితీయ బహుమతి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు ఇటీవల కళాశాల విద్యాశాఖ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల పోటీలలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఇంపాక్ట్ ఆఫ్ రైతుబంధు స్కీమ్ ఆన్ ఫార్మర్స్, ఏ స్టడీ ఆఫ్ రాజన్నసిరిసిల్ల డిస్ట్రిక్ట్' అనే అంశంపై స్టడీ ప్రాజెక్టు రూపొందించారు. రాష్ట్రస్థాయిలో పోటీపడ్డ 20 ప్రాజెక్టులలో అగ్రహారం విద్యార్థుల ప్రాజెక్టు రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జిజ్ఞాస పోటీలలో ద్వితీయ బహుమతి సాధించిన కామర్స్ అధ్యాపకులు మల్లారెడ్డి, విద్యార్థులు వి.సుష్మ, ఎం.లహరిక, రాజేశ్, యశ్వంత్, అనిరుధ్‌లను అభినందించారు.

రిమ్స్‌లో స్కాన్ అండ్ షేర్



స్కాన్ అండ్ షేర్‌ను ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆసుపత్రితో పాటు సూపర్ స్పెషాలిటీలోనూ స్కాన్ అండ్ షేర్ క్యూఆర్ కోడ్ విధానం అమల్లోకి తెచ్చారు. పేషెంట్లు రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించి ఉండకుండా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ మొబైల్ కలిగి ఉన్న వారు ప్లేస్టోర్ ద్వారా ఏబీహెచ్ఏ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ టోకెన్ నంబర్ వస్తోంది. కౌంటర్ వద్ద ఆ నంబర్ చెబితే సరిపోతోంది. వివరాలన్నీ అందులోనే నిక్షిప్తమై ఉంటాయి. సంబంధిత వైద్యుడి వద్దకు వెళ్లి అవసరమైన చికిత్స పొందవచ్చు. ఈ విధానాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఎంవో చందు, ఆయుష్మాన్ భారత్‌మిషన్ సిబ్బంది రేణుక, అశ్విన్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి



కాంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ అనిత రాజేంద్రన్

- పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ అనిత రాజేంద్రన్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అనిత రాజేంద్రన్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. కాంపోస్ట్ షెడ్డును సందర్శించి తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. వారి వెంట డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తదితరులున్నారు.

పీఆర్ పథకాలు పటిష్టంగా అమలు చేయాలి

గుడిహత్నూర్: పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న పలు పథకాలు, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆమె తోషంలో నిర్వహిస్తున్న ఎరువుల తయారీ కేంద్రం, మొక్కల నర్సరీని పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డీఎల్పీవో ఫణిందర్, డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్‌హై, ఏపీవో శామ్యూల్, కార్యదర్శి లావణ్య తదితరులున్నారు.

రామగుండంలో భారీగా యూరియా ఉత్పత్తి



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) కర్మాగారంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించారు. గత ఏప్రిల్‌లో 1,14,002.82 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసి రికార్డు సాధించామని సీజీఎం సుధీర్‌కుమార్ ఝా తెలిపారు. ఇంతవరకు తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా యూరియా సరఫరా చేశామని వివరించారు.

యూరియా సరఫరా తీరు ఇలా(మె.ట)

రాష్ట్రం	సరఫరా
తెలంగాణ	35,332.65
ఆంధ్రప్రదేశ్	8,407.98
కర్ణాటక	20,319.75
మహారాష్ట్ర	14,649.12
ఛత్తీస్‌గఢ్	13,526.37
తమిళనాడు	13,520.43
మధ్యప్రదేశ్	8,246.52

ఎన్టీపీసీ బూడిదను వదలని మంత్రి 'పొన్నం'



మాట్లాడుతున్న ఎస్సీమోర్చా జాతీయ ప్రధానకార్యదర్శి ఎస్.కుమార్, చిత్రంలో రాణిరుద్రమ తదితరులు

- బండి చేసిన అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు
- బీజేపీ నేతలు ఎస్.కుమార్, రాణి రుద్రమ

కరీంనగర్‌టౌన్: ఎన్టీపీసీ బూడిదను వదలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీజేపీ 400 సీట్లకు పైగా గెలుస్తుందని తెలిసి పొన్నం కాలుకాలిన పిల్లిలా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతిపరుడని, ఓ ట్రావెల్స్ అధినేత నుంచి రూ.కోటిన్నర విలువైన కారుతో పాటు ఎన్టీపీసీ బూడిద నుంచి లంచాలు తీసుకున్న ఘనత పొన్నందే అన్నారు. బూడిద తీసుకెళ్లే లారీలను ఆపేసి కాంట్రాక్టర్‌ను బెదిరించి తొలుత రూ.2 కోట్లు, తరువాత మరో రూ.6 కోట్లు ఆయనతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బూడిద స్కాంపై సీబీఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. నాయకులు కన్నబోయిన ఓదెలు, రమణారెడ్డి, లోకేశ్, బొంతల కల్యాణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.